www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 8 ఆగస్టు 2024
5
అన్నమయ్య



'హార్సిలీహిల్స్‌లో పర్యాటకాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి'

ప్రజాశక్తి-బి.కొత్తకోట

హార్సిలీహిల్స్‌లో పర్యాటకాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. బుధవారం జెసి ఆదర్శ రాజేంద్రన్‌తో కలిసి హార్సిలీహిల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయుటకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని, ఈ రంగంలో ఎన్నో ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. మండలంలోని హార్సిలీహిల్స్‌కు పర్యాటకంలో ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజయవాడలో ఈనెల 5న జరిగిన కలెక్టర్ల సమావేశంలో పర్యాటక శాఖపై కలెక్టర్లు అందరూ ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఆయన ఆదేశాల మేరకు హార్సిలీహిల్స్ ఒక పర్యాటక హబ్‌గా తయారు చేయబోతున్నామన్నారు. హార్సిలీహిల్స్‌లో ఏడు నక్షత్రాల హోటల్‌ను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఒబెరాయ్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ వారు నిర్మాణం చేయుటకు గాను సుమారు 20 ఎకరాల భూమిని పర్యాటక శాఖకు ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఈ నేపథ్యంలో ఈ హోటల్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయుటకు గాను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యుల ఆదేశాల మేరకు ఈ భూమిని పరిశీలించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘా స్వరూప్, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం, ఎడి సర్వే జయరాజ్ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటి విద్యార్థి ఆత్మహత్య

- ఇడుపులపాయలో విషాదఛాయలు
- తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు
- ఘటనపై ఆరా తీసిన డిఎస్‌పి



జమీషా ఖురేషీ (ఫైల్ ఫోటో)



విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ రంగారావు

ప్రజాశక్తి-వేంపల్లె

ఒంగోలు ట్రిపుల్‌ఐటికి చెందిన విద్యార్థి జమీషా ఖురేషీ(17) అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకొన్న సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్‌ఐటీల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే.. ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన సయ్యద్ మగ్బుల్ కుమార్తె జమీషా ఖురేషీ ఒంగోలు ట్రిపుల్ ఐటిలో సీటు రావడంతో ఇంటర్ సెకండ్ ఇయర్ (పి-2)చదువుతున్నది. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి ప్రాంగణంలో ఉన్న ఒంగోలు ట్రిపుల్‌ఐటి క్యాంపస్ చదువుతున్న జమీషా ఖురేషీ మంగళవారం రాత్రి 9 గంటలకు బ్రాత్ రూంలో తన చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని మక్కిలాయి చెందినట్లు ట్రిపుల్‌ఐటి అధికారులు తెలిపారు. స్థానిక విద్యార్థుల సమాచారంతో ట్రిపుల్‌ఐటి అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థి మృతదేహాన్ని అర్ధరాత్రి వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం మధ్యాహ్నం ఫైనల్ ఇయర్‌కు చెందిన ఓ విద్యార్థి మొబైల్ ఫోన్ క్యాంటీన్ వద్ద పోయింది. ఆ మొబైల్ ఫోన్‌ను మృతి చెందిన విద్యార్థి జమీషాఖురేషీ తీసుకున్న విషయాన్ని గుర్తించిన ట్రిపుల్‌ఐటి అధికారులు విద్యార్థిని మందలించడంతో పాటు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి వారితో విద్యార్థినితో మాట్లాడించినట్లు తెలిసింది. జమీషాఖురేషీ మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఆరోపణలు బలంగా విన్పిస్తున్నాయి. స్నేహ అవర్‌లో విద్యార్థిని కనపడక పోవడంతో ఆమె కోసం సిబ్బంది, సహ విద్యార్థులు వెతికారు. రాత్రి 11 గంటలకు బ్రాత్ రూంలో చున్నీతో ఉరి వేసుకొన్న సంఘటన చూసి ఇడుపులపాయలోని ఆసుపత్రికి తరలించి అక్కడ నుంచి వేంపల్లె ఆస్పత్రికి తరలించారు. విషయం తనకున్న సమయానికి విద్యార్థిని మృతి చెందినట్లు సిబ్బంది చెప్పారు. విద్యార్థిని మృతి చెందిన విషయాన్ని తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు ఇడుపులపాయకు బయలుదేరి వచ్చారు. ఈ ఘటనపై ఇడుపులపాయ ఔట్ పోస్ట్ పోలీసులు మృతి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. విద్యార్థి జమీషా మృతి చెందిన విషయాన్ని తెలుసుకొన్న పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్ వేంపల్లె ఆసుపత్రి వద్దకు వచ్చి విద్యార్థిని మృతదేహాన్ని పరిశీలించడంతో పాటు విద్యార్థిని తల్లిదండ్రులు మగ్బుల్, నసీమాలతో మాట్లాడారు. ట్రిపుల్‌ఐటి అధికారులతో, విద్యార్థులతో మాట్లాడి ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల్లో ట్రిపుల్‌ఐటి వద్దకు వస్తామని చెప్పమని అంతలోనే తమ బిడ్డ మృతి చెందిందని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతురాలి తల్లిదండ్రులు మగ్బుల్, నసీమాలకు ఒక కుమారుడు, కుమార్తె ఉండగా కుమారుడు బిటెక్ చేస్తుండగా, కుమార్తె ట్రిపుల్‌ఐటిలో చదువుతున్నది. చీరాల మండలంలో ఉన్న ఐటిసి కంపెనీలో మృతురాలి తండ్రి మగ్బుల్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కార్మికుడిగా పనిచేస్తూ ఇద్దరు పిల్లలు చదివిం చుకొంటున్నట్లు వారు చెప్పారు. ట్రిపుల్‌ఐటిలో మంచి చదువులు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదుగుతుందని ఎంతో ఆశతో ఉన్నామని మధ్యలో ఇలాంటి ఘోరం జరిగిందని తల్లిదండ్రులు వాపోయారు. ఆసుపత్రిలో ఉన్న విద్యార్థి మృత దేహాన్ని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్‌తో పాటు ఒంగోలు ట్రిపుల్‌ఐటి అధికారులు సందర్శించారు. విద్యార్థి మృతదేహానికి పోస్టుమార్టం చేసిన అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. విద్యార్థిని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్కేవ్యాలీ ఎస్‌ఐ రంగారావు తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య బాధాకరం : సిపిఎం

విద్యార్థి జమీషాఖురేషి ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని సిపిఎం మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. ఆసుపత్రిలో ఉన్న విద్యార్థి మృతదేహాన్ని ఆయన సందర్శించారు. విద్యార్థిని తల్లిదండ్రులతో ఘటనపై చర్చించి వారిని ఓదార్చారు.ఇడుపులపాయ డైరెక్టర్‌తో ఘటనపై అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటిలో చదివే విద్యార్థులు అందరూ యుక్త వయస్సులో ఉండే పిల్లలని ఆ వయస్సులో సున్ని తంగా ఉంటారని చెప్పారు. కళాశాల యాజమాన్యం, ప్యాకల్టీ, తల్లిదండ్రులు చాల జాగ్రత్తతో వారితో ప్రవర్తించాలని కోరారు. ఇలాంటి దుర్ఘటన్న సంఘ టనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్బరాయుడు, ఉత్తన్న, సుబ్రమణ్యం, వెంకటేష్ పాల్గొన్నారు.

చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలి : కలెక్టర్



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజలందరూ చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి తెలిపారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలో అవగాహన ర్యాలీని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్‌తో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి సాయిఇంజినీరింగ్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ 'ఒకల్ ఫర్ లోకల్' అనే నినాదంతో ప్రజలందరూ చేనేత ఉత్పత్తులను ప్రోత్సహిం చాలని కోరారు. దేశీయ పరిశ్రమలను ప్రోత్సహించడానికి 1905వ సంవత్సరం ఆగస్టు 7న స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించారని అన్నారు. 2015 నుంచి ప్రతి సంవత్సరం ఆగస్టు 7న జాతీయ చేనేత ది నోత్సవాన్ని జరుపుకుంటున్నామని అన్నారు. చేనేత రంగం ప్రాముఖ్యతను గురించి ప్రజలకు అవ గాహన కల్పించడానికి, చేనేత మీద ఆధారపడి జీవిస్తున్న ఎంతోమంది నేతన్నల సేవలను గుర్తించడం కోసం అవగాహన ర్యాలీని చేపట్టామన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో చేనేతలు తయారు చేసే వ మదనపల్లి సిల్క్ చీరలను అమ్మే స్టాల్స్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. 2023 సంవ త్సరంలో వన్ డిస్టిక్ వన్ ప్రోడక్ట్ కార్యక్రమంలో భాగంగా మన రాష్ట్రంలో విశేష ఆదరణ కలిగిన మదనపల్లి సిల్క్ చీరలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందన్నారు. అనంతరం జిల్లా చేనేత, వస్త్ర శాఖాధికారి శ్రీదేవి మాట్లాడుతూ చేనేత పరిశ్రమపై ఎన్నో కుటుంబాలు ఆధా రపడి ఉన్నాయని వారందరి సేవలను గుర్తించుకోవడానికి జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపు కుంటున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని చేనేత సంఘాలు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి : 'సిటు'



నిరసన తెలుపుతున్న మునిసిపల్ కార్మికులు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

బదిలీ విధానంలో పారిశుధ్య కార్మికులుగా విధులు నిర్వహించిన 15 మంది కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ఎన్‌జిఒ హోంలో బుధవారం మునిసిపల్ కార్మికులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ నాలుగు నెలల వేతనం నిలుపుదల చేసి కార్మికుల పొట్ట కొట్టడం సమంజసం కాదని అన్నారు. పారిశుధ్య కార్మికులందరూ పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన వారని, కనీసం వారు అద్దె ఇంట్లో అద్దె చెల్లించే స్థోమత లేకుండా దుర్భర జీవితాలు గడుపుతున్నారని ఆవేదన చెందారు. పలుమార్లు మునిసిపల్ కమిషనర్‌ను కలిసి విన్నవించినా కార్మికుల వేదన పట్టించుకోక కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల మునిసిపల్ ఎఇ మల్లేష్‌ను కలిసి ఇంటి ఖర్చుల నిమిత్తం కనీసం రూ.5 వేలు మంజూరు చేయమని ప్రాధేయపడినప్పటికీ స్పందన లేదన్నారు. కార్మికుల పట్ల నిర్లక్ష్య ధోరణి వదిలి వేతనాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికులతో కలిసి కార్యాచరణ రూపొందించి ఉద్యమానికి సిద్ధపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పివి.రమణ, డి.లక్ష్మీదేవి, కె.ప్రసాద్, ఎం.వెంకటరమణ, ఎం.ఎల్లయ్య, సి.నరసింహులు, సి.కోనయ్య పాల్గొన్నారు.

వంద శాతం పిల్లలు హాజరయ్యేలా చూడాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

అంగన్వాడీ కేంద్రాలకు పిల్లలు వంద శాతం హాజరయ్యేటట్లు చూడాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అంగన్వాడీ సిబ్బందికి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో సిడిపిఒలు, సూపర్వైజర్లు, బిపిసి, డిపిసిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ జిల్లాలో ఉన్న అన్ని అంగన్వాడీ సెంటర్లలో పిల్లలు తప్పకుండా 100 శాతం హాజరయ్యేటట్లు చూడాలని అంగన్వాడీ సిబ్బందికి సూచించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పిల్లలు అంగన్వాడీ కేంద్రంలో ఉండేటట్లు చూడాలన్నారు. చిన్నారులకు ప్రభుత్వం ఇచ్చే పౌష్టికా హారంతో పాటు నాణ్యమైన భోజనం ఇవ్వాలన్నారు. చాలామంది పేద పిల్లలు అంగన్వాడీ కేంద్రాలకు వస్తుంటారని అంగన్వాడీ టీచర్లు, ఆయాలు మానవతా దృక్పథంతో ఆలోచించి ప్రతి చిన్నారి అంగన్వాడీ కేంద్రానికి వచ్చే విధంగా చూపా లన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులందరికీ మంచి విద్య నేర్పించి వారు బాగా చదువుకునేటట్లు చూడాలన్నారు. ప్రతి ఒక్కరు విద్యా వంతులైతేనే రాష్ట్రం దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. అంగన్వాడీ కేంద్రంలో ఆయా మొదలుకుని సూపర్వైజర్ వరకు చిన్నారుల అటెండెన్స్ పై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. పిల్లలు అంగన్వాడీ కేంద్రానికి రాకపోయినా అటెం డెన్స్ వేసినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంగన్వాడి కేంద్రం లో చదివే చిన్నారులందరికీ ఆధార్ కార్డు ఉండటట్లు తగు చర్యలు తీసుకో వాలన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అంగన్వాడీ కేంద్రాల బలపటానికి ప్రత్యేక శ్రద్ధ చూపడం జరుగుతోందని ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించి బాధ్యతగా తమ విధులు నిర్వహించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో ఎత్తు, బరువు తక్కువగా ఉన్న పిల్లల సంఖ్య ఎక్కువగా ఉండటానికి గల కారణా లను గుర్తించి వారిని వైద్యాధికారి వద్దకు తీసుకెళ్లి బరువు, ఎత్తు తగ్గడానికి గల కారణా లను తెలుసుకొని తగు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో రక్తహీనత ఉన్న గర్భిణులు, బరువు తక్కువ ఉన్న పిల్లల సంఖ్యను జీరో శాతానికి తీసుకురా వడానికి తగు జరగా చెప్పటాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగినట్లయితే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరు బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. బాల్య వివాహాల వల్ల అమ్మాయి, అబ్బాయి జీవితం నాశనం అవుతుందని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు. ఇకనుంచి మన జిల్లాలో ఒకటి కూడా బాల్య వివాహం జరగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ శశికళ, సిడిపిఒలు, అంగన్వాడీ సూపర్వైజర్లు, బిపిసిలు, డిపిసిలు పాల్గొన్నారు.



డాక్టర్ లక్ష్మీప్రసాద్‌ను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

ప్రభుత్వ ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స

ప్రజాశక్తి-రాయచోటి : స్థానిక ప్రాంతీయ వైద్యశాల వైద్యులు కార్పొరేట్ వైద్యానికి తీసిపోని విధంగా అరుదైన శస్త్రచికిత్సచేసి రోగి ప్రాణాలను కాపాడారు. ప్రముఖ వైద్యనిపుణులు సీనియర్ సివిల్ సర్జన్ డాక్టర్ డి.లక్ష్మీప్రసాద్ ఆధ్వర్యంలోని వైద్య బృందం కడుపునొప్పితో వైద్యంకోసం ఆసుపత్రికి వచ్చిన ఒక నిరుపేదరోగిని పరీక్షించి, శస్త్రచికిత్స చేయకపోతే ప్రాణాలకే ప్రమాదమని ఒక నిర్ధారణకు వచ్చారు..శస్త్రచికిత్సకోసం బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ లాంటి సుదూర ప్రాంతాలకు వెళ్లడానికి తనకు ఆర్థిక స్తోమత లేదని గుర్తించిన వైద్యులు తమవద్ద అందుబాటులోగల వైద్య పరికరాలతోనే శస్త్రచికిత్స చేసి కడుపులోని 12 కణితులను తొలగించి ప్రాణదానం చేశారు. తన అనుభవనైపుణ్యంతో అరుదైన శస్త్రచికిత్సను విజయవం తంగా పూర్తి చేసిన డాక్టర్ లక్ష్మీప్రసాద్ ను తోటి వైద్యులు, ఆస్పత్రి సిబ్బంది, రోగు కుటుంబ సభ్యులు ఘనంగా సన్మానించారు. రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రిలో ఇలాంటి అరుదైన శస్త్రచికిత్స చేయడం విశేషం.

గోదాములో జెసి ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : మండల స్థాయి స్టాక్ గోడౌన్‌ను అన్నమయ్య జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్, స్టాక్ గోడౌన్‌కు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించారు. గోడౌన్‌లోని నిత్యావసర వస్తువుల నాణ్యతను పరిశీలించి తగు సూచ నలు చేశారు. గోడౌన్‌కు వెళ్లే దారిపై సర్వే అధికారులతో మాట్లాడి, త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ తనిఖీ లో పౌరసరఫరాల జిల్లా మేనేజర్ శివరాం, మదనపల్లె తహశీల్దార్లు పాల్గొన్నారు. అనంతరం కురబలకోటలోని తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. తహశీల్దార్ కార్యాలయ రికార్డు రూమును పరిశీలించి, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సిబ్బందికి వివిధ అంశాలపై తగు సలహాలు, సూచనలు ఇవ్వడంతో పాటు పలు ఆదేశాలు జారీ చేశారు.



రికార్డులు పరిశీలిస్తున్న జెసి

మత్తు పదార్థాల విక్రయాలపై ఉక్కుపాదం : డిఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లి



మాట్లాడుతున్న డిఎస్‌పి కొండయ్యనాయుడు

పట్టణంలో విద్యా సంస్థల పరిసర ప్రాంతాలలో మత్తు పదార్థాల క్రయ విక్రయాలు చేసే వారిపై ఉక్కు పాదం మోపుతామని డిఎస్‌పి కొండయ్య నాయుడు పేర్కొన్నారు. బుధవారం డిఎస్‌పి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి విక్రయించినా, రాష్ డ్రైవింగ్ చేసినా, భూములు ఆక్రమించినా ఎవరిని వదిలేదని హెచ్చరించారు. పట్టణంలో యువత ఎక్కువగా గంజాయి తాగుతున్నారని, రాష్ డ్రైవింగ్ చేస్తు న్నట్లు తమ దృష్టికి వచ్చిందని అన్నారు. కాలేజీ, స్కూల్ పరిసర ప్రాంతాలలో సిగరెట్, బీడీ, గుట్కా, వంటివి అమ్మకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. భూములు ఆక్రమణ చేసిన వారి పైన కూడా కేసులు నమోదు చేస్తామని, మీడియా, ప్రజా సంఘాలు, రాజకీయ నాయకుల ముసుగులో పోలీసు స్టేషన్ వద్ద సెటిల్ మెంట్ చేసే వారి పైన నిఘా ఉంచా మని పేర్కొన్నారు. అటువంటి వారిపై కూడా చర్యలు తప్పవన్నారు. మదనపల్లి ట్రాఫిక్ పైన దృష్టి పెట్టి రికార్డులు లేని వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు.

రేపు ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి-రాయచోటి

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం ఉదయం 10 గంటలకు రాయచోటిలోని కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా గిరిజనసంక్షేమశాఖ అధికారి పి.తేజస్విని ఒక ప్రకటనలో తెలిపారు.జిల్లాలోని గిరిజన ప్రజా ప్రతినిధులు, ప్రజా సంఘ నాయకులు, అధికారులు, విద్యార్థులు హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



షెడ్డును ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవి

'మానవత' సేవలు స్ఫూర్తిదాయకం : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

సమాజ శ్రేయస్సు కోసం మానవత సేవా సంస్థ చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని సబ్ కలెక్టర్ వైకోమ్ నిధియాదేవి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని మన్నూరులో మానవత సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన షెడ్డును ముఖ్య అతథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రాజంపేటలో గత కొంతకాలంగా మానవత సేవా సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాలను గురించి తెలుసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులను అభినందించారు. రానున్న రోజుల్లో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సభ్యులను కోరారు. భవన నిర్మాణానికి ముఖ్య కారకులు సాయి, పోకల ప్రభాకర్ లను సబ్ కలెక్టర్ చేతుల మీదుగా సన్మానించారు. అనంతరం పేద విద్యార్థిని సుప్రియ పాలిటెక్నిక్ కళాశాల ఫీజు రూ.4,700లను వారి కుటుంబ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో మానవత సంస్థ జాతీయ నియంత్రణ కమిటీ డైరెక్టర్ రామాంజనేయరెడ్డి, కార్యదర్శి నంద కిషోర్, రాటాల గోపి, కోశాధికారి రామచంద్రయ్య నాయుడు, కాకర్ల రాముడు, పతకమూరి వెంకట రమణ, తుంగా రమణారెడ్డి, అబ్దుల్లా, చంగయ్య, నాగేంద్ర నాయక్ పాల్గొన్నారు.

స్వాగత ర్యాలీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎస్‌సి వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుతో విజయం సాధించి 13న హైదరాబాద్‌కు వస్తున్న మందకృష్ణ మాదిగ మాదిగకు అన్నమయ్య జిల్లా నుంచి మాదిగ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు తరలిరావాలని మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు ప్రొఫెసర్ డాక్టర్ చిలుమూరు శ్రీనివా సరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఎంఇఎఫ్ ముఖ్య ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సామాజిక ఉద్యమాల చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని లిఖించిందని అన్నారు. హక్కుల సాధన కై పోరాడుతున్న పలు సామాజిక ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలిచిందని పేర్కొన్నారు. మందకృష్ణ మాదిగకు హైదరాబాద్‌లో స్వాగతం పలుకుతూ జరిగే భారీ ర్యాలీకి ప్రతి మాదిగ ఉద్యోగి కుటుంబంతో సహా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్‌పి జాతీయ నాయకులు నరేంద్రబాబు మాదిగ, ఎంఇఎఫ్ జాతీయ కార్యదర్శి ఒ.వి.రమణ, ఎంఇఎఫ్ సీనియర్ ఉపాధ్యక్షులు గంపల శ్రీను, గంగాధర్ పాల్గొన్నారు.

'మిట్స్' అధ్యాపకుడికి డాక్టరేట్

ప్రజాశక్తి-మదనపల్లి



జగన్నాథ్

అంగళ్ళులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న జగన్నాథ్ పట్టర్‌కు కర్ణాటకలోని తుమకూరులో ఉన్న యూనివర్సిటీ ఆఫ్ శ్రీ సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ పిహెచ్‌డి ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. మెకా నికల్ రంగంలో ట్రైబాలాజికల్ ప్రాపర్టీస్, మైక్రోస్ట్రక్చరల్ క్యారెక్టరైజేషన్‌పై చేసిన పరిశోధనకు డాక్టరేట్‌ను అందించిందన్నారు. యూనివర్సిటీ ఆఫ్ శ్రీసిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌కు డాక్టర్ డి.రమేష్, ప్రొఫెసర్, డీన్ (అకడమిక్స్), మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో పరిశోధనలు చేసినట్లు తెలిపారు. జగన్నాథ్‌ను కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువ రాజ్, విభాగాధిపతి డాక్టర్ భాస్కరన్ అభినందనలు తెలిపారు.

సమగ్ర పశుగణన లక్ష్యాన్ని పూర్తి చేయాలి

- జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ గుణశేఖర్



పశుగణన నియమాల కరదీపికలను ఆవిష్కరిస్తున్న గుణశేఖర్

ప్రజాశక్తి-పీలేరు

21వ అఖిల భారత పశుగణన-2024 సమగ్ర లక్ష్యాన్ని నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలని ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ గుణశేఖర్ పిళ్లై తెలిపారు. బుధవారం పీలేరు నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాలకు చెందిన ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పశు గణనపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఐదేళ్లకోసారి జరిగే పశుగణన ఆధారంగా భవిష్యత్తులో మన గ్రామాల్లోని పశుసంపదకు వ్యాక్సిన్లు, మందులను కేంద్ర ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు. పశుగణనలో లోపాలు తలెత్తితే కేంద్ర ప్రభుత్వం నుంచి అందే సాయంలో ఇబ్బందులు వస్తాయన్నారు. అందు కోసం తమకు నిర్దేశించిన గ్రామాల్లో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు విధిగా క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వ-మార్గదర్శకాల మేరకు గణన కార్యక్రమం నిర్వహించాలన్నారు. పశుగణనలో భాగంగా ఆవులు, మేకలు, గొర్రెలు, పందులు, తదితర 16 రకాల జంతు జాతులను లెక్కించాల్సి ఉంటుందన్నారు. గణన కోసం ప్రతి 2000 గృహాలకు ఒక ఎన్యూమేటరు, 5 మంది ఎన్యూమరేటర్లకు ఒక సూపర్వైజరును నియమించామన్నారు. ఈ గణన కార్యక్రమాన్ని సెప్టెంబర్ నెల 1వ తేదీ నుంచి ప్రారంభించి డిసెంబరు 31కి పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం రిసోర్స్ పర్సన్ల ద్వారా ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పశుగణన చేయాల్సిన విధానం, పాటించాల్సిన నియమాలను వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ డిడి డాక్టర్ మాలకొండయ్య, ఎడిలు డాక్టర్ లోకేష్, డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ వెంకటముని నాయుడు, నియోజకవర్గంలోని పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఉజ్వల భవిష్యత్తు

-జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్రబాబు

ప్రజాశక్తి-పీలేరు

రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఉజ్వల భవిష్యత్తు ఉందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్రబాబు అన్నారు. బుధవారం స్థానిక వెంకటేశ్వరస్వామి కళ్యాణ మండపంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్, ఉద్యానశాఖ సహకారంతో పీలేరు వ్యవసాయ ఉత్పత్తిదారుల కంపెనీ 6వ వార్షిక మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేయడంతోపాటు దానిలోని సంక్షోభాలను ఎదుర్కొనడానికి ప్రభుత్వం రైతులను ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత రైతులు పెద్ద ఎత్తున ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడి అభివృద్ధి చెందాలని కోరారు. ఉత్పత్తిదారుల సంఘాలకు తమ శాఖ ద్వారా ప్రభుత్వం కలెక్షన్ సెంటర్, కోల్డ్ స్టోరేజ్, ప్యాక్ హౌస్, పాలీ హౌస్, నర్సరీ షెడ్నెట్ తదితర సదుపాయాలు సబ్సిడీతో అందిస్తున్నట్లు తెలిపారు. పిఎంఎఫ్ఎంఇ పథకం కింద విలువ ఆధారిత ఉత్పత్తులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీతో కూడిన పరిశ్రమల ఏర్పాటుకు దోహదపడుతున్నాయని పేర్కొన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ గుణశేఖర్ పిళ్ళై మాట్లాడుతూ తమ శాఖ ద్వారా పశు కిసాన్ క్రెడిట్ కార్డ్, పశు బీమా పథకం, గోకులం పథకం, పిఎంఇజిపి పథకాల గురించి రైతులకు వివరించారు. పట్టు పరిశ్రమ శాఖ అధికారి నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తమ శాఖ ద్వారా పట్టు పరిశ్రమలు ఏర్పాటు చేసే ఔత్సాహిక రైతులకు సబ్సిడీతో కూడిన పథకాన్ని ప్రభుత్వం అందజేస్తుందని పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ నిపుణులు బోధిషావలి మాట్లాడుతూ మామిడి పంటను, ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో ఇతర ఉద్యాన వ్యవసాయ పంటలను పండించినట్లయితే మార్కెట్లో అధిక ధరకు కొనుగోలు చేయడానికి అనేకమంది వ్యాపారస్తులు ఎగుమతి దారులు ఉన్నారని , కావున రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని కోరారు. కార్యక్రమంలో పీలేరు ఉద్యాన శాఖ అధికారి సుకుమార్, మత్స్య శాఖ అధికారి మోహన్ కృష్ణ, పట్టు పరిశ్రమ శాఖ అధికారి నాగేశ్వర్ రెడ్డి, హెచ్ఇఒ దరహాస, డిఆర్‌పి మహేష్, ప్రాజెక్ట్ మేనేజర్ భార్గవి, సిఇఒ ప్రత్యూష, పూజిత, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్రబాబు



తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అంగన్వాడీ సూపర్‌వైజర్లు

పిల్లలకు తల్లిపాలు తప్పనిసరి

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని జాగువారిపల్లె పంచాయితీ ప్రకాష్‌నగర్ కాలనీలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో బిసిడిఎస్ సూపర్‌వైజర్లు నిర్మలాదేవి, మణెమ్మ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు మొదటి వ్యాధి నిరోధక శక్తిగా పనిచేస్తుందని, బిడ్డకు ఆరు నెలలు వచ్చేంతవరకు పూర్తిగా తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని సూచించారు. తల్లిపాలలో 50 శాతం ఐరన్ ఉంటుందని తెలిపారు. మన దేశంలో 37 శాతం పిల్లలు మాత్రమే ఆరు నెలల వరకు తల్లిపాలు తాగుతున్నారని అన్నారు. పిల్ల లకు తల్లిపాలు ఇవ్వకపోవడం వలన 20 వేల వరకు తల్లుల మరణాలు సంభవిస్తున్నాయని, కాబట్టి తల్లిపాలు బిడ్డకు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శివలక్ష్మి, రజియా, అంగన్వాడీ టీచర్లు శ్రీలక్ష్మి, వనజ కుమారి, రోజా, ఆశాలత, రమాదేవి, ఎఎన్ఎం నాగమణి, ఆశా వర్కర్ సునీత, గర్భవతులు, బాలింతలు, గ్రామస్తులు పిల్లలు పాల్గొనడం జరిగింది. **వీరబల్లి :** తల్లిపాల వారోత్సవాలలో భాగంగా బుధవారం అంగన్వాడీ కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. మండలంలోని గడికోట పంచాయతీ పెద్దూరు అంగన్వాడీ కార్యాలయం వద్ద కూరగాయలు స్టాల్ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా మండల వైద్యాధికారి జియా ఉల్లా పాల్గొని మాట్లాడుతూ తల్లి పాల ప్రాముఖ్యత, తల్లిపాలు బిడ్డకు ఎంత అవసరమో తెలియజేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. బిడ్డ పుట్టిన మొదటి గంటలో తల్లి పసుపు రంగులోని చిక్కటి పాలు బిడ్డకు అమృతం లాంటిది అని వివరించారు.

బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్లు

ప్రజాశక్తి-గాలివీడు

ప్రజలకు అందుబాటులో వుండి ప్రజా సమస్యల పరిష్కారం రించ దానికి కృషి చేస్తానని తహశీల్దార్ జె.భాగ్యలత పేర్కొన్నారు. బుధవారం తహశీల్దార్‌గా ఆమె బాధ్య తలు చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ మండ లంలోని 17 గ్రామాలలో పది రోజుల పాటు రైతుల భూముల వద్ద సర్వే యర్లు, విఆర్ఒ, విఆర్ఎలు భూములు పరిశీలిస్తారని అన్నారు. 2003 సంవ త్సరం నుంచి చుక్కల భూములు, డికెటి భూములు, అసైన్డ్ భూములు వారి కేటాయించిన భూమిలో వారు ఉన్నారా లేరా అని దానిపైన సర్వే చేస్తు న్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే చేస్తున్నట్లు పేర్కొన్నారు. డిటి తిమ్మారెడ్డి సిబ్బందితో కలిసి మండలంలో ఉన్న వనరుల పైన సమీక్షించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న జె.భాగ్యలత

కలికిరి : కలికిరి తహశీల్దార్‌గా మహేశ్వరి బాయ్ బుధవారం బాధ్యతలు చేప ట్టారు. ఎన్నికల విధుల్లో భాగంగా ఇక్కడ పనిచేసిన తహశీల్దార్ విజయకుమారి అనంతపురం జిల్లాకు బదిలీ కాగా, కడప తహ శీల్దార్‌గా పని చేస్తున్న మహేశ్వరి బాయ్ కలికిరికి బదిలీపై వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతు లకు, ప్రజలకు ఎలాంటి రెవెన్యూ సమస్యలు లేకుండా ఎప్పటి కప్పుడు పరిష్కరించే విధంగా కృషి చేస్తామని తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న మహేశ్వరి బాయ్

సుండుపల్లి: సుండుపల్లి తహశీల్దార్‌గా బుధవారం దైవాదీనం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఉన్న పేద ప్రజలు సమస్యలు పైన దృష్టి పెడతామని సమస్యలు వచ్చిన వెంటనే వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా విఆర్ఒ దుశ్శాలువాతో తహశీల్దార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు రవిశంకర్, బసయ్య, నరసింహులు, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

వీరబల్లి: వీరబల్లి మండల శ్రావణి బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న తహశీల్దార్ శ్రీనివాసులు బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో రెవెన్యూ విభాగంలో పనిచేస్తూ బదిలీపై వీరబల్లి తహ శీల్దార్‌గా వచ్చినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సిబ్బందికి సహ కరించాలని కోరారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రావణి

చిన్నమండెం: చిన్నమండెం తహశీల్దార్‌గా నరసింహులు బాధ్యతలు స్వీకరించారు. ఈయన గతంలో సంబేపల్లి తహశీల్దార్ కూడా విధులు నిర్వహించారు. కార్యాలయంలో సిబ్బంది తో సమీక్ష సమావేశం నిర్వహించారు. చుక్కల భూముల గురించి సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న నరసింహులు

కుక్కల బెడద నుంచి రక్షించండి

ప్రజాశక్తి-గాలివీడు

పట్టణంలోని వీధులలో కుక్కలు తిరుగుతూ రోడ్డుపైన వెళ్లే ద్విచక్ర వాహనదారులకు కూడా అడ్డుపడుతూ ప్రమాదాల బారిన పడేస్తున్నాయని వాటి నుంచి మా ప్రాణాలను రక్షించాలని బుధవారం తహ శీల్దార్ భాగ్యలత, ఇఒపిఆర్‌డి శేఖర్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి సురేష్ కుమార్‌కు స్థానిక ప్రజలు అందించారు. చిన్నపిల్లలు బయటికి వెళ్లాలన్నా చాలా ఇబ్బందిగా ఉందని రోడ్డుపైన కుక్కల వల్ల అనేక ప్రమా దాలు జరుగుతున్నాయని అన్నారు. వీటిపై దృష్టి పెట్టి పట్టణంలో కుక్కల బెడద నుంచి ప్రజల ప్రాణాలను కాపాడాలని విన తి పత్రంలో పేర్కొన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఆనంద్, చిన్నయ్య, వేణు, జయరాములు, సుమిత్ర, వీరా, సాహెబ్, గంగయ్య, గిరిజ పాల్గొన్నారు.



ఇఒపిఆర్‌డికి వినతిపత్రం అందిస్తున్న స్థానికులు

రోగులకు మెరుగైన వైద్యం అందాలి

-మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ పేర్కొన్నారు. బుధవారం నిమ్మనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రి నిర్వహణ, రోగుల రిజిస్టర్లను, ఔషధాల స్టాక్ రిజిస్టర్లను, ల్యాబ్ టెక్నీషియన్ గదులను, రోగుల పడకగదులను డాక్టర్ ప్రత్యూషతో కలిసి పరిశీలించారు. డ్యూటీల ప్రకారం వైద్య ఆరోగ్య సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల రికార్డులను తప్పకుండా నమోదు చేయాలన్నారు. రాత్రి వేళల్లో ఉన్న డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ఇతర సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అన్నారు. సాధారణంగా రాత్రి వేళల్లో అత్యవసర వైద్యం కోసం రోగులు వస్తుంటారని వైద్య ఆరోగ్య సిబ్బంది ఆస్పత్రిలో అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ కాన్పులను చేయడానికి కృషి చేయాలన్నారు. క్రమం తప్పకుండా గ్రామాలలో వ్యాక్సినేషన్ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. 108 వాహనాన్ని 24 గంటలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రి ఆవరణాన్ని నిత్యం పరిశుభ్రంగా ఉంచాలన్నారు. వర్షాకాలం కావడంతో దోమల ప్రబలకుండా గ్రామాలలో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాలను చేపట్టాలని చెప్పారు. ఆస్పత్రి ఆవరణంలో సిసి కెమెరాలు నిత్యం పనిచేస్తుండాలని తెలిపారు. ఆసుపత్రికి కాలింగ్ బెల్ లేకపోవడంతో రాత్రి వేళల్లో వచ్చిన రోగులకు ఇబ్బందిగా ఉందని కాలింగ్ బెల్‌ను అమర్చాలని టిడిపి మండల అధ్యక్షులు పుర వెంకటరమణ సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆస్పత్రిలో సెక్యూరిటీ గార్డ్‌ను ఏర్పాటు చేయాలని డాక్టర్ ప్రత్యూష సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేయాల్సిన వసతులను త్వరలోనే ఏర్పాటు చేస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ధనంజయలు, డాక్టర్ ప్రత్యూష, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్

సొంత భూమిలో ఇసుకకు అడ్డంకులా : ఆర్‌జె

- ఇసుక రవాణాను పరిశీలించిన అటవీశాఖ ఉన్నతాధికారులు



ఆర్‌జె వెంకటేష్‌తో మాట్లాడుతున్న అటవీశాఖ అధికారులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండలంలోని నూరుకుప్పలకొండ అటవీ ప్రాంతం నుంచి ఇసుక అక్రమంగా రవాణా జరుగుతుందంటూ అందిన ఫిర్యాదు మేరకు సబ్ డివిజన్ అటవీ శాఖాఅధికారి శ్రీనివాసులు, మదనపల్లి అటవీశాఖ రేంజ్ అధికారి మదనమోహన్ తన సిబ్బందితో కలిసి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలిం చారు. నూరుకుప్పలకొండ అటవీ ప్రాంత సమీపంలోని టిడిపి నాయకులు ఆర్‌జె.వెంకటేష్ కు చెందిన మామిడి తోట నుంచి ఇసుకను తన ఇంటి నిర్మాణానికి తీయడం జరిగిందని అన్నారు. అటవీ ప్రాంతం నుంచి ఆక్రమంగా ఇసుకను ఎవరు తరలించలేదని తెలిపారు. అటువంటి సంఘటనలపై నిత్యం అటవీశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌జె.వెంకటేష్ మాట్లాడుతూ తన ఇంటి నిర్మాణానికి సొంత భూమిలో ఇసుకను తీసుకున్నా అధికారులు అడ్డంకులను సృష్టిస్తున్నారని అన్నారు. రాచవేటివారిపల్లె పంచాయతీ గొల్లపల్లి సమీపంలోని నూరుకుప్పలకొండ అటవీ ప్రాంతంలో తనకు సంబంధించిన మామిడి తోట నుంచి ఆచార్లపల్లిలో సొంత ఇంటిని నిర్మించుకోవడానికి సొంత భూమి నుంచి ఇసుకను తీసుకురావడం జరిగిందన్నారు. రాజకీయంగా గిట్టని వారు నాపై బురద చల్ల డానికి ఆరోపణలు చేయడం, అడ్డంకులను సృష్టించడం చేస్తున్నారని అన్నారు. టిడిపి అధికారంలోకి రాగానే ప్రజలకు ఉచిత ఇసుక పాలసీని తీసుక వచ్చారని అన్నారు. పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న తనపై కొంత మంది పని కిరాని ఆరోపణలు చేస్తున్నారని, సొంత భూమిలో నుంచి ఇసుకను తీసుకుంటే అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేసిన వారిని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అటవీశాఖ అధికారులు మాట్లాడుతూ నూరు కుప్పల కొండ అటవీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని అందిన ఫిర్యాదు మేరకు తాము క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిపారు. వెంకటేష్‌కు చెందిన మామిడి తోట నుంచి మాత్రమే ఇసుకను తరలించారని, అటవీ ప్రాంతంలో ఎక్కడ ఇసుకను తరలించలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు సుధాకర, శోభారాణి, హరి శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.



అంగన్వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

అంగన్వాడీ కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించాలి

-కలెక్టర్ శ్రీధర్ చామకూరి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

అంగన్వాడీ కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి సూచించారు. మండలంలోని కాండ్లమడుగు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అంగన్వాడీ కేంద్రంలో పనిచేస్తున్న అంగన్వాడీ కార్యకర్తతో మాట్లాడుతూ పిల్లలందరూ సమయానికి వస్తున్నారా, ఏ సమయాలకు భోజనం పెడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రంలో పని చేస్తు న్న సిబ్బంది హాజరు రిజిష్టర్, కేంద్రానికి అందిస్తున్న గుడ్లు, ఇతర ఆహార పదార్థాలకు సంబం ధించిన రిజిస్టర్లను పరిశీలించారు. పిల్లలకు ఎప్ప టి కప్పుడు పౌష్టికాహారం అందించాలని, గుడ్లు అందుబాటులో ఉండా లని ఆదేశించారు. లబ్దిదారులకు సకాలంలో పౌష్టికాహారం అందేలా చర్యలు తీసు కోవాలన్నారు. ఈ తనిఖీలో కలెకక్టర్ వెంట జెసి ఆదర్శ రాజేంద్రన్, మదన పల్లి సబ్ కలెక్టర్ మేఘా స్వరూప్ పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తొలగింపు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని వైకోట దళితవాడలో 11 కెవి విద్యుత్ తీగలు ప్రజల చేతికి అందే ఎత్తులో ఉండటంతో బుధవారం రైల్వేక ోడూరు టిడిపి నియో జకవర్గ ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ అధికా రులు విద్యుత్తు తీగలను తొలగించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లినా ఏ మాత్రం పట్టించుకోలేదని అన్నారు. ఇచ్చిన అర్జీలు చెత్తబుట్టలకే పరిమితమయ్యాయని అన్నారు. నూతనంగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం గ్రామ ప్రజలు సమస్య తెలిపిన వెంటనే ముక్కా కుటుంబం వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేసి సమస్యను పరిష్కరించిందని హర్షం వ్యక్తం చేశారు. గ్రామాలలో ఎటువంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకుని వస్తే తక్షణమే పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని సాయి వికాస్ రెడ్డి తెలిపారు. రైతులకు ప్రభుత్వం అందజేస్తున్న మోటారు కరెంటును సక్రమంగా అందజేయాలని విద్యుత్ అధికారులను కోరారు. కార్యక్రమంలో ఆడపాల ప్రేమ్ కుమార్, షేక్ ఫయాజ్, బండారు మహేష్, నల్లంశెట్టి రామయ్య, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యుత్ తీగలను తొలగిస్తున్న సిబ్బంది

ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

ప్రజాశక్తి-గాలివీడు

స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలో గురువారం జరిగే స్కూల్ కమిటీ చైర్ పర్సన్ ఎన్నికలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాజకీయ నాయకులు స్థానిక నాయకులు అందరూ సహకరించాలని లక్కిరెడ్డిపల్లి సిఐ జీవన్ గంగానాథబాబు పేర్కొన్నారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ వెంకటప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు ఏకగ్రీవంగా జరగడానికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. పోటీ లేకుండా ప్రశాంతంగా ఎన్నికలు స్వచ్ఛందంగా జరుపుకోవడానికి అందరూ సహకారం అందివ్వాలని అన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపిపి రమేష్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బికె.మహమ్మద్, రియాజ్, టిడిపి మండల అధ్యక్షుడు రవీంద్రబాబు, భద్రప్పనాయుడు, ప్రతాప్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు వేస్తే చర్యలు

ప్రజాశక్తి - రామసముద్రం : మాంసపు దుకాణాలు నిర్వహించే దుకాణదారులకు చెంబకూరు పంచాయతీ కార్యదర్శి మునిస్వామి నాయక్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ బహిరంగ ప్రదేశంలో మరియు జనసంచారంలో మాంసపు వ్యర్థాలను వేయకూడదని దుకాణదారులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశంలో వ్యర్థాలు వేయకూడదని సూచించారు. కుక్కలు బెడద ఎక్కువైందని , కుళ్ళిన వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

పిటిఎం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉద్రిక్తత

- భారీగా మోహరించిన పోలీసులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పెద్దతిప్పసముద్రం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. తంబళ్ళపల్లి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డిని పోలీసులు హౌస్‌అరెస్టు చేశారు. బుధవారం జరగాల్సిన సర్వసభ్య సమావే శాన్ని టిడిపి కార్యకర్తల అడ్డుకుంటారని ముందస్తుగా ఐదు గంటలకే ఎంపి డిఒ కార్యాలయంలోకి వెళ్లి వైసిపి ఎంపిటిసి సభ్యులు తాళాలు వేసుకున్నారు. వైసిపి ప్రభుత్వంలో వీరంతా దొంగచాటున ఎంపిటిసిలు అయ్యారని, ప్రజల చేత ఎన్నుకోబడిన వారు కాదని టిడిపి కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే రాజీనామా చేసి ప్రజల్లోకి వెళ్లి ప్రజల చేత ఎన్నుకోబడి సమావేశం ఏర్పాటు చేసుకోవాలని, లేనిపక్షంలో ఈ సర్వసభ్య సమావేశాన్ని అడ్డుకుం టామని టిడిపి శ్రేణులు హెచ్చరించారు. గత ప్రభుత్వంలో అధికార యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకొని ఎన్నికలు జరపకుండా నియోజకవర్గ వ్యాప్తం గా ఏకగ్రీవం చేశారని గో బ్యాక్ ఎంపిటిసిలు అంటూ నినాదాలు చేశారు. అక్కడ ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడటంతో పోలీసులు భారీగా మోహరించారు.



ఎంపిడిఒ కార్యాలయం ఎదుట నిరసన చేస్తున్న టిడిపి శ్రేణులు



అల్ట్రా సౌండ్‌ను ఇన్‌స్టాల్ చేస్తున్న డాక్టర్ శరత్ కమల్

గర్భిణులకు ఉచిత పరీక్షలు

ప్రజాశక్తి-నందలూరు

మండల ప్రభుత్వ వైద్యశాలలో ఉచిత అల్ట్రా సౌండ్ ద్వారా గర్భిణులకు ఉచిత పరీక్షలు అందుబాటులో ఉంటాయని ప్రభుత్వ వైద్యాధికారి శరత్ కమల్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రతి నెల 9,10వ తేదీలలో గర్భిణులకు నిర్వహించే పరీక్షలతో పాటు అవసరమైన వారికి అల్ట్రా సౌండ్ ద్వారా గర్భిణులకు ఉచిత పరీక్షలు అందుబాటులో ఉంటాయని అన్నారు. ఈనెల 9న రాజంపేటకు చెందిన ప్రముఖ గైనకాలజిస్ట్ మస్తానమ్మ గర్భిణులనుపరీక్షించడానికి వస్తున్నారని, ఈ అవకాశాన్ని తప్పకుండా వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ కార్తీక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నారా యణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మిట్టపల్లి గోపిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

సొంత నిధులతో పాఠశాల అభివృద్ధి

ప్రజాశక్తి-గాలివీడు

పాఠశాలకు సొంత నిధులతో అభివృద్ధి చేసిన ఘనత మిట్టపల్లి రజితమ్మ, భర్త మిట్టపల్లి గోపిరెడ్డికే దక్కుతుందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు మొహిద్దీన్ పేర్కొన్నారు. బుధవారం వారిని ఉపాధ్యాయులతో కలిసి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపిరెడ్డి ఎస్ఎంసి చైర్మన్‌గా ఎన్నికైనప్పటి నుంచి బాలుర పాఠశాలకు ఎన్నో విశిష్ట సేవలను అందించారని అన్నారు. వారి అవ్వా తాతలు దివంగత మిట్టపల్లి పక్కిరా రెడ్డి, లీలావతమ్మ జ్ఞాపకార్థంగా ఒక పెద్ద ఆడిటోరియం నిర్మించారని అన్నారు. పాఠశాలలో వంట చేయ డానికి రేకుల షెడ్‌ను కూడా ఏర్పాటు చేశారని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కానాల శివారెడ్డి, మహమ్మద్‌గౌస్, రవి, నరేంద్ర పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎపిఒ రమణయ్య

వ్యవసాయ అనుసంధాన పనులపై దృష్టి

ప్రజాశక్తి-గాలివీడు

గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద వ్యవసాయ అనుబంధ పనుల పైన దృష్టి పెట్టాలని ఎపిఒ రామచంద్రయ్య పేర్కొన్నారు. బుధవారం ఉపాధి కార్యాలయంలో ఎఫ్ఎటిఎ ఉపాధి సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూలీల సంఖ్య పెంచాలని , జాబ్ కార్డ్ కలిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించాలని తెలిపారు. ఉపాధి నిధులు పుష్కలంగా ఉన్నాయని బ్యాంక్ ఖాతాలకు ఆధార్ సీడింగ్ అయ్యిందా లేదా అని సరిచూసుకోవాలని సూచించారు. ఫారం పాండ్స్, బౌండరీ వెంచర్స్ ఉపయోగపడే పనులను దృష్టిలో ఉంచుకొని ఫీల్డ్ అసిస్టెంట్లు జాగ్రత్తగా విధులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ-2 హరిప్రసాద్, ఇసి బాలాజీ, టిఎలు, ఎఫ్ఎలు, సిబ్బంది పాల్గొన్నారు.

మురుగు కాలువలు శుభ్రం : ఎంపిడిఒ

ప్రజాశక్తి-వీరబల్లి : మండలంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిలిచి ఉన్న వర్షపు నీరు, చెత్తాచెదారం, కాలువల్లో మురుగు లేకుండా పారిశుధ్య పనులను చేయించి నట్లు ఎంపిడిఒ రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పలు వీధుల్లో సర్పంచ్ జయరాణి, ఎంపిడిఒ పర్యటించి కార్మికులను అప్రమత్తం చేశారు. మురికి కాలువల్లో నిల్వ ఉన్న చెత్త, మురికినీరు జెసిబి సహాయంతో తొల గింపజేశారు. అంటు వ్యాధుల బారిన పడకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి : 'నల్లారి'

ప్రజాశక్తి-కలికిరి : మండల కేంద్రం కలికిరిలోని ఇందిరమ్మ కాలనీకి ఎదురుగా టిడిపి నాయకుడు, రెడ్డి జెఎసి రాష్ట్ర కార్యదర్శి పులి సత్యనారాయణ రెడ్డి నూతనంగా ఏర్పాటు చేసిన ధరణి హోటల్‌ను బుధవారం ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సాధారణ రైతు కుటుంబం నుంచి రెడ్డి జెఎసి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా, టిడిపి నాయకుడిగా సేవా కార్యక్రమాలు చేస్తూ, 20 సంవత్సరాలుగా ధరణి హోటల్ నడిపిస్తూ వాయల్పాడు కలికిరి మండలంలో ఎన్నో శుభకార్యాలకు ఆహారం సరఫరా చేసి అందరి మన్ననలు పొందారని అన్నారు. , స్వతహాగా అభివృద్ధి చెంది హోటల్ యజమాని అవ్వడం అభినందన నీయమని అన్నారు. హోటల్‌కు వచ్చే కస్టమర్లకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో పలువురురెడ్డి జెఎసి సభ్యులు, టిడిపి నాయకులు, శ్రేయోభిలాషులు పాల్గొని ఆయనకు, కుటుంబ సభ్యులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నల్లారి చంద్రారెడ్డి, నల్లారి లక్ష్మీకర్‌రెడ్డి, కంభం నిరంజన్‌రెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు నిజాముద్దీన్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



హోటల్‌ను ప్రారంభిస్తున్న నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కిరణ్ కుమార్‌రెడ్డి (23) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మండలంలోని మాధవరం పోడుకు చెందిన కిరణ్ కుమార్‌రెడ్డి మోటార్ బైక్ పై వెళుతున్న సమయంలో మైసూరువారిపల్లె వద్ద ప్రధాన రహదారిపై లారీ బైక్ ఢీకొని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

మినీ గురుకులంలో సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

మండలం అనంతరాజుపేట లోని మినీ గిరిజన బాలికల గురుకుల పాఠశాలను రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నిధియాదేవి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గురుకులంలో విద్యార్థులకు ఎలాంటి వసతులు కల్పిస్తున్నారనే అంశాలపై అణు అణువునా క్షుణ్ణంగా పరిశీలించారు. ముఖ్యంగా ఆర్ ఒవాటర్ ప్లాంట్ పనిచేస్తుందా లేదా, మంచినీటి కుళాయిలు ఎలా పనిచేస్తున్నాయని వాటిని స్వయంగా తిప్పి పరిశీలించారు. అనంతరం స్టోర్ రూమును సందర్శించి అక్కడ ఉన్నటువంటి బియ్యం, ఇతర సరుకులను పరిశీలించారు. చివరగా మినీ గురుకులంలో కల్పిస్తున్న వస్తువులపై అక్కడ ఉన్న విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వసతులు కల్పించాలని మెనూపకారం భోజనాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. విద్యలో ఏ విద్యార్థి కూడా వెనక పడకుండా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యార్థులను తీర్చేదిద్దాలని తెలిపారు.

తహశీల్దార్ కార్యాలయంలోనూ..

తహశీల్దార్ కార్యాలయాన్ని కూడా సబ్ కలెక్టర్ తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డు గదిని పరిశీలించారు. రికార్డులు ఒక గ్రామ పద్ధతిలో భద్రపరచాలని ఎక్క డపడితే అక్కడ గందరగోళంగ ఉంచరాదని అక్కడున్న సిబ్బందికి సూచించారు. కార్యాలయంలోని సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు.